ప్రజాశక్తి
శనివారం 26 జులై 2025
5
విజయనగరం



24 గంటల్లో భారీ వర్షాలు

అధికారులంతా అప్రమత్తం : ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రానున్న 24 గంటల్లో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఇంఛార్జి కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా మత్స్య శాఖ సూచనలు ఇవ్వాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయి లోనే ఉండి పరిస్థితుల్ని అంచనా వేయాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. చెరువులు గట్లు తెగి ప్రవహాల వలన నష్టం జరగకుండా జల వనరుల అధికారులు గట్లను పటిష్టంగా ఉండేలా చూడాలని తెలిపారు. అధికారులంతా 24/7 అందుబాటులో ఉండాలని ఆదేశించారు

గిరిజన భూములు లాక్కోవడం అన్యాయం

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- బాధితులతో కలిసి భూములు పరిశీలన
- ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా



బాధితులతో కలిసి భూములను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-రామభద్రపురం/బొబ్బిలి

ఎన్నో ఏళ్లుగా తాత ముత్తాతల నుంచి ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న గిరిజన రైతులను ఎటువంటి ముందస్తు సమాచారం, నోటీసులు లేకుండా లేకుండా లాగేసుకోవడం, యంత్రాల సహాయంతో పంటలను నాశనం చేయడం సమంజసం కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఇ పార్కు నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న మండలంలోని కాకర్లవలస, కారేడువలస గిరిజన భూములను శనివారం మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావుతో కలసి తమ్మినేని పరిశీలించారు. గిరిజన రైతులతో మాట్లాడి వారికి జరిగిన అన్యాయంపై విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్తివలస పంచాయతీ పరిధిలోని కాకర్లవలస , కారేడువలస గ్రామాల మధ్య 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం సుమారు 187 ఎకరాల భూమిని రూ.7.48 కోట్లకు ఎపిఐఐసికి విక్రయించిందన్నారు. అప్పటికే ఈ భూములు గిరిజనుల సాగు హక్కులో ఉన్నాయని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఏ రెవెన్యూ అధికారి ఈ భూముల స్థితిగతులు కూడా పరిశీలించ కుండా ఇక్కడ పార్కుకు కేటాయించడం అన్యాయమని అన్నారు. ఎప్పటిలాగే ఈ భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజన రైతన్నలు పత్తి, మొక్కజొన్న, మామిడి, జీడి మామిడి వంటి పంటలు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. తాజాగా ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా ఏపుగా పెరుగుతున్న పంటలను జెసిబిల సహాయంతో నాశనం చేయించడం సమంజసం కాదని అన్నారు. వాస్తవంగా భూములు ప్రభుత్వానికి చెందినవని, ఎపిఐఐసికి అమ్మకం ద్వారా సంక్రమించినా పార్కు నిర్మాణానికి కేటాయించినా ఇన్నేళ్లుగా సాగు చేస్తూ జీవనో పాధి గడుపుతున్న గిరిజన రైతుల నోట్లో మట్టి కొట్టకుండా వారికి అనువుగా ఉన్న చోట ప్రత్యామ్నాయ పద్ధతిలో వేరే భూములు కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఎక్కడో సుదూర ప్రాంతాల్లో రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో సాగు చేయాలని చెప్పడం పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం గిరిజన రైతులకు న్యాయం చేసే వరకు వారి పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి రాంబాబు,గ్రామ పెద్దలు, గిరిజనులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

గిరిజనులకు అన్యాయం చేస్తే అండగా పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు అన్నారు. బాధితులకు మద్దతుగా ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గిరిజన రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. గిరిజనులకు ఆ భూములను అప్పగించి నాశనం చేసిన పంట, తోటలకు నష్టపరిహారం ఇవ్వాలని, లేనిచో భూములకు నష్టపరిహారం చెల్లించి వేరే చోట భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, గిరిజనులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో సాంకేతికత వినియోగం

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంనుంచి వివిధ పోలీసుస్టేషన్ల అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. శక్తి టీమ్స్ పనితీరు, రిపీటెడ్ నిందితులు, మహిళల అదృశ్యం, గంజాయి కేసులు, ఫైనాన్సియల్ దర్యాప్తు, నాన్ బెయిలబుల్ వారంట్ల ఎగ్జిక్యూషను సమీక్షించి, పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, సాంకేతికత వినియోగం గురించి దిశా నిర్దేశం చేసారు. ప్రతి పాఠశాలలో శక్తి వారియర్స్ టీమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తరచూ నేరాలకు పాల్పడుతున్న నిందితులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. దర్యాప్తుకు ఉపయోగపడే సాంకేతికత పట్ల అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. 20 కిలోల కంటే ఎక్కువగా గంజాయిని సీజ్ చేసిన ఎన్.డి.పి.ఎస్. కేసుల్లో నిందితులు సంపాదించిన అక్రమ ఆస్తులపై దర్యాప్తును ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యారెడ్డి, ఎం.వీరకుమార్, ఆర్.గోవిందరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ ప్రభావతి, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అశోక్ గజపతిరాజుకు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న గోవా అధికారులు

గోవా గవర్నర్‌గా నేడు అశోక్ ప్రమాణ స్వీకారం

కుటుంబ సభ్యులతో కలిసి పయనం • గోవాలో ఘన స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

గోవా గవర్నర్‌గా నియమితులైన టిడిపి సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గవర్నర్ బంగ్లా దర్బార్ హాల్‌లో ఉదయం 11గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో అశోక్ గజపతి రాజు తన కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం ఉదయం గోవాకు పయనమయ్యారు. ఆయన వెంట కుమార్తె స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, భార్య సునీలాగజపతి, ఇతర కుటుంబ సభ్యులు వెళ్లారు. అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారానికి జిల్లాలో ఉన్న అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో గోవాకు తరలి వెళ్లారు. ఈకార్యక్రమానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సహ పలువురు ఎంపిలు హాజరు కానున్నారు. గోవా చేరుకున్న అశోక్ గజపతిరాజుకు అక్కడి ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పల నాయుడుతో పాటు గోవా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కాండేవేఇవు, రాష్ట్ర మంత్రి మౌవిన్ గోడింహో, ప్రోటోకాల్ సెక్రటరీ ఎం.గాడ్కర్, డిజిపి అలోక్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే ప్రవీణ్ అర్లేకర్, పలువురు గోవా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు.

కొనసాగుతున్న జిందాల్ బాధితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ కర్మాగారానికి భూములు ఇచ్చి మోసపోయిన రైతులు తమకు న్యాయం చేయాలని నెల రోజులుగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం శుక్రవారం కొనసాగింది ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు చల్లా జగన్ మాట్లాడుతూ జిందాల్ నిర్వాసితులను యాజమాన్యం నమ్మించి నిలువెల్లా ముంచి చెవిలో పూలే కాకుండా పెద్ద ఆకులే పెట్టిందని విమర్శించారు. జిందాల్ యాజమాన్యం 10 విలువగల షేర్ మూడేళ్లలో 100 రూపాయలకు తక్కువ కాకుండా పెరుగుతుందని , కంపెనీలో వాటాతో పాటు కంపెనీలో ఉద్యోగాలు పొందడం ద్వారా స్థిరమైన ఉపాధి లభిస్తుందని నమ్మించిందని తెలిపారు. ఎకరాకు కేవలం 2లక్షలు మాత్రమే రైతుకు ఇచ్చి, నిరుపేదలైన గిరిజన దళిత భూమంతా కారు చౌకగా తీసుకుందని తెలిపారు. ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ కు సిద్ధపడి భూములిచ్చిన రైతులను భూమికి, కంపెనీలకు దూరం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి భూమి కోల్పోయి కూలీలుగా మారిన రైతులకు భూమి అప్పగించాలని డిమాండ్ చేశారు.

న్యాయ పోరాటం చేస్తాం

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిందాల్ భూముల విషయంలో ప్రభుత్వం అడ్డగోలుగా ముందుకెళ్తోందని, దీనిపై బాధితులకు మద్దతుగా న్యాయ పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్పష్టంచేశారు. శుక్రవారం నగరంలోని ఐఎంఎ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను ఇబ్బందులు పెడుతూ భూములను చదును చేస్తున్నారు. రైతుల పంటలను పూర్తిగా ధ్వంసం చేస్తూ, భూముల్లో ఉన్న చెట్లు తొలగిస్తున్నారు. ఎంఎస్ఎంఇ పార్కు పెడతామని చెబుతున్నారు. రైతుల భూములకు సంబంధించి నష్టపరిహారం అంశాన్ని పరిష్కరించకుండా భూములపైకి ఎలా వెళ్తార'ని ప్రశ్నించారు. జిందాల్ కంపెనీకి భూములు ఇచ్చిన తరువాత ఇంతవరకూ కార్యకలాపాలు చేపట్టలేదన్నారు. అందుకే రైతులకు తిరిగి భూములు ఇవ్వాలని పోరాటం చేస్తున్నామన్నారు. ఇదే విషయంపై ఎస్‌టి కమిషన్‌కు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఎంఎస్ఎంఇ పార్కులో ఏర్పాటు చేయనున్న కంపెనీలకు కాలుష్య నియంత్రణ మండలి.. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా అనుమతులు ఇచ్చేలా చూస్తున్నారని ఆరోపించారు. చట్టబద్ధంగా కాకుండా అడ్డగోలుగా ప్రభుత్వం ముందుకు వెళు తుందని, దీనిపై న్యాయపోరాటం చేస్తానని తెలిపారు.

ప్రతిరోజూ గుడ్డు తినండి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- పొదుపు మహిళలకు ఎగ్ కార్టుల పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోషకాహార లోపం నివారణకు ప్రతిఒక్కరూ రోజూ గుడ్డు తినాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కోడిగుడ్లు తినడం ద్వారా మంచి ప్రోటీన్ లభిస్తుందని సూచించారు. పదిమంది పొదుపు సంఘాల మహిళలకు ఒక్కొక్కటి రూ.50 వేలు విలువైన ఎగ్ కార్టులను స్థానిక టిటిడిసి మహిళా ప్రాంగణంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ ఎగ్ కార్టుల ద్వారా గుడ్లతో తయారు చేసిన వివిధ ఆహార పదార్థాలను విక్రయించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటి (ఎన్ఇసిసి) రాష్ట్రంలో వెయ్యి మందికి ఎగ్ కార్టులను ఉచితంగా పంపిణీ చేయడానికి ముందుకు వచ్చినందుకు అభినందనలు తెలిపారు. మొదటి విడతగా రెండు నెలల్లో 250 ఎగ్ కార్టులను పంపిణీ చేస్తున్నామని, తరువాత నెలరోజుల్లోనే మిగిలిన వాటి పంపిణీని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ ఎగ్ కార్టుల ద్వారా గుడ్ల వినియోగం పెరగడమే కాకుండా, మెరుగైన పోషకాహారం అందించబడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపం ఎక్కువగా కనిపిస్తోందని, విరివిగా, చౌకగానే లభించే గుడ్లను వినియోగించడం ద్వారా ఈ లోపం నుంచి బయట పడవచ్చునని సూచించారు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల సహకారంతో మహిళలను ఆర్థికంగానే కాకుండా సామాజికంగా, ఆరోగ్యపరంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి ఎన్నో కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారని మంత్రి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పీడీ కె.సావిత్రి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, స్త్రీనిధి మేనేజర్ కష్ణంనాయుడు, డిపిఎం రాజ్‌కుమార్, ఎన్ఇసిసికి చెందిన (ఎగ్‌కార్ట్) జోనల్ ఛైర్మన్ అరవింద్, పలువురు డిపిఎంలు, ఎపిఎంలు, ఇతర డిఆర్‌డిఎ అధికారులు, సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.




ఎగ్‌కార్టుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్

పరిహారం 30 శాతానికి పెంచాలి

'హెచ్‌పిసిఎల్' భూసేకరణ సభలో ఎపి రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి-గంట్యాడ

హెచ్‌పిసిఎల్ పైపులైను కోసం సేకరిస్తున్న భూమికి పరిహారం 10 శాతం నుంచి 30 శాతానికి పెంచాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు.. అధికారులను డిమాండ్ చేశారు. హెచ్‌పిసిఎల్ పైపులైను భూసేకరణ కోసం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.సుధాకర్ మాట్లాడుతూ మండలంలో ఏడు గ్రామాల్లో పైప్‌లైన్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. పెంటశ్రీరాంపురంలో 80, రేగుబిల్లిలో 17, డొంకాడలో 58, కొండతామరపల్లిలో 85 గింజేరులో 86, పెద్దమజ్జిపాలెంలో 114, వసాదిలో 19 మంది రైతుల భూముల్లో పైపులైను వేయడానికి గుర్తించామన్నారు. రైతులకు నష్టపరిహారాన్ని పది శాతం ఇస్తామని తెలిపారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ రైతులకు పరిహారం 30 శాతానికి పెంచడంతోపాటు ఆరు పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. చెట్లు ఉన్నవారికి వాటి కాలపరిమితిని బట్టి నష్టపరిహారం చెల్లించాలన్నారు. తోటలున్న ప్రాంతంలో ఐదు మీటర్ల వెడల్పుకు మించి భూమి తీసుకోరాదన్నారు. పైపులైను వేసిన తర్వాత భూమిని చదును చేసుకోవడానికి సెంటుకు రూ.3 వేలు చొప్పున, భూమిని సారవంతం చేయడానికి రూ.2 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఎక్కడైనా పైపులైను మరమ్మతులకు గురైతే రైతులది బాధ్యత కాదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠేశ్వరరావు, హెచ్‌పిసిఎల్ చీఫ్ మేనేజర్ జి.కిశోర్, రిటైర్డ్ తహశీల్దార్ జి.అప్పలనాయుడు, గంట్యాడ తాసిల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు ఆదినారాయణమూర్తి, రైతులు కోడెల శ్రీనివాసరావు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం నాయకులు రాంబాబు

30 ఏళ్ల కల నెరవేరింది

అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగమాధవి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

నెల్లిమర్ల నియోజకవర్గ ప్రజల 30 ఏళ్ల నాటి కల సాకారం చేసుకోవడానికి నేటితో బీజం పడిందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్త కొప్పెర్లలో అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు మూడు దశాబ్దాలుగా అగ్నిమాపక కేంద్రం కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారినా ఆ కల మాత్రం నెరవేరలేదన్నారు. ఎన్నికల ముందే ఈ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం అవసరాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు చెప్పానన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వేగంగా చర్యలు తీసుకొని ప్రజల కలను నిజం చేశానని తెలిపారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతానికి గట్టి రక్షణ లభించనుందన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసి ఇవ్వాలని కాంట్రాక్టరు పసుపులేటి గోపిని కోరారు. కార్యక్రమంలో నేతలు లోకం ప్రసాద్, కె.శ్రీనుబాబు, పతివాడ శ్రీను, కోట్ల రఘు, బాల అప్పలరాజు, సర్పంచ్ సత్తిబాబు, డి.గణేష్, నక్కన రమణ, ఇజ్జురోతు ఈశ్వరరావు, సింహాచలం, డెంకాడ ఎంపిపి వాసుదేవరావు, చనమల్ల వెంకటరమణ, ఫైర్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.



అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

టిడిపి నేతలు దూరం

అగ్నిమాపక కేంద్ర శంకుస్థాపన కార్యక్రమానికి టిడిపి నాయకులు దూరంగా ఉన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు సైతం హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. తమకు సమాచారం లేకుండా శంకుస్థాపన ఏమిటని పది రోజుల క్రితం ఈ కార్యక్రమాన్ని టిడిపి నాయకులు అర్ధాంతరంగా వాయిదా వేయించిన విషయం తెలిసిందే. దాంతో నియోజకవర్గంలో కూటమిలో కుమ్ములాట బహిరంగంగా బయటపడింది. శంకుస్థాపనకు తామే తేది నిర్ణయిస్తామని టిడిపి ప్రచారం చేసింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు సమక్షంలో ఈ శంకుస్థాపన జరగాలని టిడిపి పట్టు పట్టింది. తన నియోజకవర్గంలో మీ పెత్తనం ఏమిటని ప్రశ్నించకుండానే శుక్రవారం ఆకస్మికంగా ఎమ్మెల్యే శంకుస్థాపన కార్యక్రమం పెట్టారు. దాంతో టిడిపి నేతలు ఎవరు హాజరు కాలేదు. తమకు సమాచారం లేకపోవడం వల్లే కార్యక్రమానికి హాజరుకాలేదని టిడిపి నేతలు చెబుతున్నారు. అయినా ఎమ్‌పి అప్పలనాయుడు పార్లమెంట్ సమావేశాల్లో ఉంటుండగా శంకుస్థాపన ఎలా పెడతారని టిడిపి నేతలు అంటున్నారు. ఎమ్మెల్యే నాగ మాధవి ఏకచత్రాధిపత్యం సాగిస్తూ, నియోజకవర్గంలో టిడిపిని భూస్థాపితం చేయాలనే ఆలోచనలో ఉన్నారని ఆరోపించారు. వైసిపి నేతలతో అంటకాగుతూ టిడిపికి చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయాన్ని కూటమి పెద్దల దృష్టికి తీసుకెళ్తామంటున్నారు.

మాత, శిశు మరణాలను అరికట్టాలి

డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో మాతా శిశు మరణాలను అరికట్టాలని డిఎంహెచ్ఒ డాక్టర్ జీవనరాణి సూచించారు. శుక్రవారం ఆమె అధ్యక్షతన మాతా శిశు మరణాల నివారణ జిల్లా ఉప కమిటీ సమీక్షా సమావేశం తన ఛాంబర్‌లో నిర్వహించారు. గత నెలలో జిల్లాలో సంభవించిన 1 మాతృ మరణం, 2 శిశు మరణాలపై సమీక్షించారు. భవిష్యత్తులో మరణాలు సంభంవించకుండా ఉండేందుకు క్షేత్ర స్థాయి నుండి ఉన్నత శ్రేణి ఆసుపత్రికి తరలించే వరకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. రక్త హీనత గల గర్భినులకు పిహెచ్‌సిలో ఐరన్ సుక్రోస్ ఇంజెక్షన్ లు ఇవ్వాలని , అవసరమైన వారికి ఉన్నత శ్రేణి ఆసుపత్రికి పంపి రక్త ఎక్కించేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేలా క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ ఆర్.అచ్యుతవల్లి, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఎన్. పి. పద్మ శ్రీరాణి, డిఎల్‌టిఒ డాక్టర్ కె.రాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత, డాక్టర్ జివికె. సత్యనారాయణ, డిప్యూటీ ఎంహెచ్ఒ ఎన్.సూర్యనారాయణ, పిహెచ్‌సి వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు తిరుమల-మెడికవర్‌లో మెడికల్ ఫెలోషిప్ కాన్ఫరెన్స్

170 మంది వైద్యులు హాజరు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని తిరుమల-మెడికవర్ ఆసుపత్రిలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు మెడికల్ ఫెలోషిప్ కాన్ఫరెన్స్ ఘనంగా జరుగనుంది. కార్యక్రమానికి దేశం నలుమూలల నుండి సుమారు 170 మంది వైద్యులు హాజరై వైద్య రంగంలో తాజా పరిజ్ఞానాన్ని పంచుకోనున్నారు. వివిధ స్పెషాలిటీ వైద్య నిపుణులు తమ అనుభవాలను, పరిశోధనల విషయాలను ఈ వేదికపై వివరించనున్నారు. ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో శిక్షణా సెషన్లు, లైవ్ డెమోన్స్ట్రేషన్లు కూడా నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా యువ వైద్యులకు నూతన చికిత్సా విధానాలపై అవగాహన పెంపొందుతుంది. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఇది దోహదపడనుందని ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ తిరుమల ప్రసాద్ తెలిపారు.



నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అపార్ట్‌మెంట్లకు, కాలనీల్లో పేదల ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు వస్తున్న సిబ్బంది నిలదీసి స్మార్ట్‌మీటర్లను తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూఅప్ ఛార్జీలు రద్దు.. అనే ప్రచార భేరి కార్యాక్రమాన్ని శుక్రవారం 29వ వార్డులో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ వద్దంటూ ముద్రించిన స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అదాని స్మార్ట్ మీటర్స్ బద్దలు కొట్టాలని ఎన్నికల ముందు మాట్లాడిన లోకేష్ ఇప్పుడు వాటిని అనుమతించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే అయ్యప్పనగర్ లో సాయి అమృత రెసిడెన్సీలో బిగించేందుకు వచ్చిన సిబ్బందిని అక్కడి అయ్యప్ప నగర్ పోరాట కమిటీసభ్యులు అడ్డుకున్నారని తెలిపారు. నగరంలో సిపిఎం చేసిన సర్వేలో 2024లో 600 వచ్చిన కరెంట్ బిల్లు నేడు రూ.2వేలు వస్తున్నదన్నారు. ఇప్పటికే ఈ భారం మోయలేక పోతున్నామని, అదానీ స్మార్ట్ మీటర్ బిగిస్తే ముందే వేలాది రూపాయలు రీచార్జ్ చేసుకుని, భారీగా బిల్లు వస్తే భరించలేమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి యుఎస్ రవికుమార్. ఎం. జగదాంబ, ఎం.శాంతమూర్తి పాల్గొన్నారు.

2027 డిసెంబర్‌కి రీ సర్వే పూర్తి

రెవెన్యూ జిల్లా ప్రత్యేక అధికారి గోవిందరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రీ సర్వే ప్రక్రియను రాష్ట్రంలో 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించినదని రెవిన్యూ జిల్లా ప్రత్యేక అధికారి, ఎస్ ఎస్ ఎల్ ఆర్ అదనపు సంచాలకులు ఆర్. గోవిందరావు తెలిపారు. శుక్రవారం జిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటన అనంతరం కలెక్టర్ కార్యాలయం సమావేశమందిరంలో రీ సర్వే మరియు రెవిన్యూ అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీ సర్వే, ఇండ్ల స్థలాలు రీ వెరిఫికేషన్, రెగ్యులరైజేషన్, పిజిఆర్ఎస్, శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయింపు, కులాల వెరిఫికేషన్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జెసి సేతు మాధవన్ జిల్లాలో జరుగుతున్న రీ సర్వే వివరాలను తెలిపారు. జీవో నెంబర్ 23 ప్రకారం ఇళ్ల స్థలాల వెరిఫికేషన్, జీవో నెంబర్ 30 ప్రకారం ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ, పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఆడిట్ తదితర వివరాలను తెలిపారు. పిజిఆర్ఎస్ అర్జీలకు సంబంధించి ఐదు ప్రశ్నలతో అర్జీదారుల నుంచి ప్రజాభిప్రాయం సహకరిస్తున్నట్లు తెలిపారు. ఎస్-ఎస్ఎల్ఆర్ అదనపు సంచాలకులు ఆర్. గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేసేందుకు మొదటి, రెండవ విడతలలో పూర్తిచేసిన గ్రామాలు మినహా జిల్లాలో మిగిలిన గ్రామాలన్నింటిలో 3వ దశలో రీ సర్వే చేపట్టాలని తెలిపారు. ఆగస్టు 5వ తేదీ కల్లా గ్రామ సరిహద్దులు గుర్తింపు, సెప్టెంబర్ 15 నాటికి రెవెన్యూ రికార్డు స్వచీకరణ, నవంబర్ ఐదు నాటికి ప్రభుత్వ స్థలాలు గుర్తింపు ప్రక్రియలు పూర్తి చేయాలని తెలిపారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం అందజేసేందుకు వెరిఫికేషన్ పూర్తి చేసి నివేదిక అందించాలన్నారు. ఇళ్ల స్థలాలకు అవసరమైన స్థలాలను యిళ్ళ నిర్మాణాలకు అనువుగా ఉండే ప్రాంతాలలో ప్రతిపాదించా లన్నారు. జీవో నెంబర్ 30 ప్రకారం అర్హులైన పేదవారందరికీ క్రమబద్ధీకరణ చేసేందుకు వివరాలు సేకరించాలన్నారు. జాయింట్ ఎల్‌డిఎం వలన కొంతమంది సంక్షేమ పథకాలను కోల్పోతున్నారని , అటువంటి వారిని గుర్తించి సమస్య పరిష్కరించి, వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్. శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు డి.కీర్తి, మోహనరావు, ఆశయ్య, సర్వే శాఖ ఎడి రమణమూర్తి, కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి గోవింద్, తాహశీల్దార్లు, మండల సర్వేయర్లు , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రీసర్వే వివరాలను పరిశీలిస్తున్న రెవెన్యూ జిల్లా ప్రత్యేక అధికారి గోవిందరావు

గ్రోత్ సెంటర్ రోడ్లకు మోక్షం

ప్రజాశక్తి-బొబ్బిలి



రోడ్డు పనులు చేపడుతున్న పొక్లెయినర్

స్థానిక గ్రోత్ సెంటర్ రోడ్లుకు మోక్షం కలుగుతుంది. గ్రోత్ సెంటర్ రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి చెరువులను తలపించడంతో పారిశ్రామిక వేత్తలు, కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమలకు ముడి సరుకు తరలించాలన్న, పరిశ్రమల నుంచి ఉత్పత్తి బయటకు వెళ్లాలన్న నరకం చూసేవారు. రోడ్ల దుస్థితిపై ఎమ్మెల్యే బేబినాయన ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడంతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. నిధులు కావడంతో నిర్మాణ పనులు ప్రారంభించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజాం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ఉద్యోగ సమయంలో చనిపోయిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలైన రిటైర్మెంట్ బెనిఫిట్ 75 వేల రూపాయలు, ఎక్స్‌గ్రేషియో 5 లక్షల నుండి 7 లక్షల రూపాయలకు పెంపు, దహన సంస్కారాల ఖర్చులు 15 వేల నుండి 20వేలకు పెంపు, సంక్షేమ పథకాల అమలు హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు పి.రాజేష్, చిన్నబాబు, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

కాలువల ప్రక్షాళన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని శివారు ప్రాంతాల్లో కొన్నిచోట్ల మూసుకుపోయిన కాలువలను జెసిబిల సహాయంతో ప్రజారోగ్య సిబ్బంది సరిచేస్తున్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో వర్షపునీరు, వాడుక నీరు ఎక్కడ నిలువ ఉండరాదని ఆదేశించారు. దీంతో జెసిబిలు, డోజర్ల సహాయంతో నీరు నిలిచి ఉన్న ప్రాంతాలను గుర్తించి కాలువలుగా ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నారు. ఎక్కడపడితే అక్కడ, ఆరు బయట చెత్త వేయరాదని కమిషనర్.. ప్రజలను కోరారు. దీనివల్ల కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయని చెప్పారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పి వకుల్ జిందాల్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'పోలీసు వెల్ఫేర్ డే' నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు.

ఫిజియోథెరపీని వినియోగించుకోండి

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక జెడ్‌పి హైస్కూలులో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ప్రతీ శుక్రవారం ఉదయం 10 నుండి సాయంత్రం 4వరకు ఫిజియోథెరపీ అవసరం ఉన్న విద్యార్థులకు డాక్టర్ పతివాడ అఖిల్ ఉచితంగా సేవలు అందిస్తున్నారు. విద్యార్థులలో పక్షవాతం, ఆర్థోపెడిక్, వికలాంగత్వం, ప్రమాదాల బారిన పడినవారు, నరాలు, కండరాలు, ఎముకుల సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని హెచ్‌ఎం దత్తి సత్యన్నారాయణ తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, భవిత కేంద్రం ఐఇఆర్‌పిలు సత్యన్నారాయణ, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ నిబంధనలు తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఎక్సైజ్ శాఖ నిబంధనలను బ్రాందీ షాపు యాజమాన్యాలు కచ్చితంగా పాటించాలని చీపురుపల్లి ఎక్సైజ్ సిఐ సిహెచ్ చక్రవర్తి హెచ్చరించారు. శుక్రవారం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గల చీపురుపల్లి, గరివిడి ప్రాంతాలలోని పలు మద్యం దుకాణాలను ఆయన సిబ్బందితో తనిఖీ చేశారు. అధిక ధరలకు మద్యం అమ్మ చూపితే చర్యలు చేపడతామన్నారు. నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహించాలని హెచ్చరించారు. బ్రాందీ షాపుల నిర్వహణకు సంబంధించి ఇటువంటి ఫిర్యాదులు వచ్చినా తక్షణమే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో ఎక్సైజ్ హెచ్‌సి పద్మనాభరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డిపో వద్ద ఇయు ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అరకు గన్నెల కూడలిలో ఆర్‌టిసి బస్ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఒడిశా వాసులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి ఇయు ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక డిపో గేటు వద్ద ధర్నా చేశారు. ఇయు డిపో అధ్యక్షులు కెజి నాయుడు, కార్యదర్శి కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే స్టాప్‌బోర్డులు

ప్రజాశక్తి-డెంకాడ

ప్రమాదాల నివారణకు స్టాప్‌బోర్డులు ఏర్పాటు చేస్తున్ననట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. శుక్రవారం డెంకాడ పోలీసుస్టేషన్ పరిధిలో భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ ఆధ్వర్యాన ఎస్ఐ స్టాప్‌బోర్డులను ఏర్పాటుచేశారు. విజయనగరం -విశాఖపట్నం జాతీయ రహదారిలో బ్లాక్ స్పాట్లను గుర్తించామని ఆయన తెలిపారు. అలాంటి చోట రేడియం స్టిక్కర్లు అంటించిన ట్రైర్లను ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు కూడా జాగ్రత్తలు పాటించి వాహనాలను నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

వార్-2 ట్రైలర్ రిలీజ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జూనియర్ ఎన్‌టిఆర్, హృతిక్ రోషన్ నటించిన వార్2 సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం శుక్రవారం శ్రీకృష్ణా థియేటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా అభిమానులు భారీ కేక్ ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. థియేటర్ హోరెత్తేలా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా నందమూరి ఫ్యాన్స్ ప్రెసిడెంట్ కాగితపు శ్రీనివాసరావు, సెక్రెటరీ కనకల మన్మధ రావు, స్టేట్ వైడ్ ఫ్యాన్స్ కన్వీనర్ యోగేష్ యాదవ్, యూత్ ప్రెసిడెంట్ తులసి రామ్, పిన్నింటి హరి, వెంకటేష్, ఉపేంద్ర, కళ్యాణ్, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

అనాథ బాలికలకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి- రామభద్రపురం

రొంపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుతున్న అనాథ విద్యార్థినులకు సైకిళ్ళు వితరణగా అందజేశారు. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు అమెరికాకు చెందిన వికె యూనివర్సిల్ ఫ్యామిలీ ఫౌండేషన్, క్రేజీబీ సర్వీసెస్ వారి సహకారంతో 3 సైకిళ్ళు కొనుగోలు చేసి ప్రధానోపాధ్యాయులు జెబిడి రాజు ద్వారా అందజేశారు. ఇందుకు సహకరించిన ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

అతిసార నుంచి పిల్లల్ని రక్షించాలి

దుర్భర ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి : ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్, అధికారులు

డయేరియాతో బాధ పడుతున్న వారిని గుర్తించి తక్షణ వైద్య సేవలు అందించాలని, 5 సంవత్సరాల లోపు వయసు గల పిల్లల్లో డయేరియా మరణాలు సంభవించకుండా చూడాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. స్టాప్ డయేరియా పేరుతో జూన్ 1 నుండి జూలై 31 వరకు జిల్లాలో పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, డయేరియా కేసులను గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం ఇంచార్జ్ కలెక్టర్ సేతు మాధవన్ తన ఛాంబర్ లో వైద్యాధికారుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటిని క్లోరినేషన్ చేయాలని, నీటి ట్యాంక్ లను పరిశుభ్రం చేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో కూడా వేడి వేడి ఆహారాన్ని, పరిశుభ్రమైన తాగు నీటిని సరఫరా చేయాలని సూచించారు. టెస్ట్ కిట్లను, మందులను అన్ని ఆసుపత్రుల్లో సిద్ధంగా ఉంచాలని, ఒఆర్ఎస్ పాకెట్లను సరఫరా చేయాలని తెలిపారు. అతిసారపై ఇంటింటి సర్వే జరపాలని, జింక్ మాత్రలు, ఒఆర్ఎస్ పాకెట్లను ఇంటింటికీ అందేలా చూడాలని, డయేరియాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించాలని, ఆగష్టు తర్వాత జిల్లాలో డయేరియా కేసులు పూర్తిగా తగ్గాలని అన్నారు. ఈ సందర్భంగా అతిసార వ్యాధి నుండి మీ పిల్లల్ని రక్షించండి అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ జీవన రాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి, డిఐఒ అచ్యుత కుమారి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ సాంబమూర్తి, రాజాం మున్సిపల్ కమిషనర్ అప్పల నాయుడు, పబ్లిక్ హెల్త్ ఇఇ జ్యోతి, ఐసిడిఎస్ సిడిపిఒ, విద్య శాఖ ఎడి తదితరులు పాల్గొన్నారు.

కూటమిది నయవంచన

మాజీ ఎమ్‌పి బెల్లాన, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్‌పి బెల్లాన, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి-డెంకాడ

టిడిపి కూటమి నాయకులు నయవంచనకు పాల్పడ్డారని మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ధ్వజమెత్తారు. భోగాపురం మండలంలోని సవరవిల్లిలో వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓట్ల కోసం లేనిపోని హామీలతో ప్రజలను మభ్యపెట్టారని, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత అవేమీ అమలు చేయకుండా కాలం వెళ్లదీయడం మోసం కాదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజలను బురిడి కొట్టించి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించడం సిగ్గుచేటని విరుచుకుపడ్డారు. ఇటీవల కొత్తవలస మండలంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడును ఆడబిడ్డ నీది ఎప్పుడు ఇస్తారని మహిళలు అడిగితే, అది ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాల్సిందేనని మంత్రి అనడం దుర్మార్గమన్నారు. హామీలు ఇచ్చినప్పుడు తెలీదా రాష్ట్ర బడ్జెట్ అంత లేదనంటూ మండిపడ్డారు. ఇప్పుడిప్పుడే కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గ్రహిస్తున్నారని, వారే రాబోయే రోజుల్లో గట్టి బుద్ధి చెబుతారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గెలిచిన వెంటనే వంద రోజుల్లో 100 కంపెనీలు తీసుకువస్తామని హామీలిచ్చి ఓట్లు వేయించుకున్న తరువాత ఒక కంపెనీ కూడా తీసుకురాలేదని, ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు.

అనంతరం తూడెం, రావాడ, కవులువాడ, పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపిపి రావాడ సూర్యనారాయణ రాజు, ఎస్‌సి సెల్ రాఊ ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచులు ఉప్పాడ శివారెడ్డి, ఉప్పాడ భాస్కర్ రెడ్డి, రమణ, ఎంపిటిసి తాతయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని సోంపురం, జగ్గయ్యపేట, సింగరాయి, ఆతవ గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎంపిపి డి.సత్యవంతుడు ఆధ్వర్యాన చేపట్టారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై విస్తృతంగా ప్రచారం సాగించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎన్.వెంకట్రావు, సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఉప సర్పంచ్ వంటాకు శీను, కాసుబాబు రామకృష్ణ, వి.రామనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. జగ్గయ్యపేటలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

డైట్‌ను సందర్శించిన ఆర్‌జెడి



డైట్ లెక్చరర్లతో మాట్లాడుతున్న ఆర్‌జెడి విజయభాస్కర్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణ సంస్థ (డైట్)ను ఆర్‌జెడి టి.విజయ్‌భాస్కర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామకృష్ణారావు, అధ్యాపకులతో ఆయన సమావేశమయ్యారు. 57 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు ప్రిన్సిపల్.. ఆయనకు వివరించారు. అనంతరం ఆర్‌జెడి మాట్లాడుతూ జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అటువంటి వృత్తిలో మరింత నైపుణ్యంతో ఉత్తమ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం డైట్ ద్వారా శిక్షణ కల్పిస్తుందని తెలిపారు. ఛాత్రోపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన ఉపాధ్యాయులను తయారు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.అప్పలనాయుడు, స్టాఫ్ సెక్రటరీ వి.చిన్నంనాయుడు, లెక్చరర్లు కె.అప్పారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లకు భారీగా ప్రోత్సాహకాలు

ఎఐసిటిఇ మేనేజర్ భీమా లింగేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-డెంకాడ

స్టార్టప్‌లకు భారీగా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఎఐసిటిఇ మేనేజర్ భీమా లింగేశ్వర్‌రెడ్డి తెలిపారు. లెండి కళాశాలలో ఎఐసిటిఇ ఇండోవేషన్ సెంటర్ రీజనల్ మీటప్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నూతనంగా నెలకొల్పిన ఎఐసిటిఇ ఇండోవేషన్ సెంటర్ ప్రాముఖ్యత మరియు టెక్నాలజీ బదిలీ పట్ల తీసుకోవాల్సిన చొరవ గురించి అధ్యాపకులకు, ఔత్సాహిక విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, ఐఐసి విభాగం డీన్ వై.వి.కోటేశ్వర్ రావు, కార్యక్రమ నిర్వాహకులు ఆర్.సంతోష్, ప్రొఫెసర్ ఎ.వి.పరాంకుశం, తిరుమల పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిసి కాలనీలోగల పోస్ట్ మెట్రిక్ బాయ్స్ ట్రైబల్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పిడిఎస్‌ఒ ఆధ్వర్యాన శుక్రవారం విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కె.సోమేశ్వరరావు మాట్లాడుతూ హాస్టల్లో విద్యార్థులు వాడుతున్న నీరు సరైన కాలువలు లేక అక్కడే నిల్వ ఉండి మురుగు ఏర్పడుతుందన్నారు. ఈ సమస్యను గత ఏడాది అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. విద్యార్థులకు తాగునీరు కూడా లేనందున వెంటనే ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పిడిఎస్‌ఒ సభ్యులు వినయ్ కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సిలబస్ ప్రకారం బోధన చేయాలి

ఐసిడిఎస్ పీడీ విమలరాణి

ప్రజాశక్తి-బొబ్బిలి



సిబ్బందితో మాట్లాడుతున్నఉ ఐసిడిఎస్ పీడీ విమలరాణి

అంగన్వాడీ కేంద్రాల్లో సిలబస్ ప్రకారం బోధన చేయాలని ఐసిడిఎస్ పీడీ టి.విమలరాణి కోరారు. పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలు, బాలసదన్ వసతిగృహాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. పిల్లలకు బోధించే విధానాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రం చుట్టూ ఉన్న గార్డెన్, లోపల వివిధ రకరకాల బొమ్మలు చూసి అంగన్వాడీ కార్యకర్త రమాదేవి. వరలక్ష్మిలను అభినందించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. బాలసదనం స్టాఫ్‌తో మాట్లాడి, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సిడిపిఒ జె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆటో మ్యుటేషన్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తుల ఆటో మ్యుటేషన్ అమలుపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య.. అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో పన్నుల వసూళ్ల ప్రక్రియను ముమ్మరం చేయాలన్నారు. ఇప్పటివరకు పన్ను విధింపులేని ఆస్తులను గుర్తించి త్వరితగతిన వాటికి పన్నులను విధించాలని చెప్పారు. సమావేశంలో సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి యువజన సంఘం వితరణ

ప్రజాశక్తి-తెర్లాం

బూరిపేట యువజన సంఘం సభ్యులు పేద విద్యార్థికి సైకిల్ వితరణ అందజేశారు. శుక్రవారం గొలుగువలస గ్రామానికి చెందిన పేద విద్యార్థి వంగ నానిబాబు బూరిపేట ఎంపిపి పాఠశాల 6వ తరగతిలో చేరాడు. ఈనేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన శ్రీ జ్ఞాన సరస్వతి యువజన సేవా సంఘ సభ్యులు నూతన సైకిల్‌ను ఆ విద్యార్థికి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పేద వారిని సేవా దృక్పథంతో ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు వూళ్ళ సింహాచలం మాస్టర్, గౌరవ సలహాదారు బొత్స అప్పలస్వామి నాయుడు మాస్టర్, స్పోర్ట్స్ ఆర్గనైజర్ బి.భాస్కర్, స్కూల్ హెచ్ ఎం నారాయణరావు, సర్పంచ్ బి. మధుసూదనరావు, బూరి తవిటి నాయుడు మాస్టారు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సైకిల్ అందజేస్తున్న యువజన సంఘం నాయకులు

నర్సు ఉద్యోగాల శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ వారు రాష్ట్రంలో నర్సింగ్ కోర్సులు చేసి ఆ రంగంలో ప్రావీణ్యం పొందిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఎం.అన్నపూర్ణమ్మ తెలిపారు. ఆ ఉద్యోగులు సాధించేందుకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని, ఇందుకోసం దరఖాస్తు చేయాలని తెలిపారు. జర్మన్ లాంగ్వేజిలో 8 నుంచి 10 నెలలు పాటు శిక్షణ పొందేందుకు రాష్ట్రంలో విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి కేంద్రాలలో నర్సింగ్ (బిఎస్‌సినర్సింగ్/ జిఎన్.ఎం) నందు డిగ్రీ పట్టా పొందిన షెడ్యూల్డు కులాలు, తెగల మహిళా యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బిఎస్‌సి నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్లక్లినికల్ అనుభవం లేదా జియన్‌ఎం నర్సింగ్ పూర్తి చేసిన మూడేళ్ల క్లినికల్ అనుభవం కలిగిన వారు 35 ఏళ్లవయస్సు మించకుండా ఉన్న వారు శిక్షణకు అర్హులని తెలిపారు. ఉచిత శిక్షణకు వచ్చేనెల 7లోగా http://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు.

లీకులతో తాగునీరు వృథా

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని నాయుడు కాలనీలో లీకులతో తాగునీరు వృథాగా పోతుంది. పైపులైన్ లీకవ్వడం వలన కాలనీలో రెండు చోట్ల తాగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీనివల్ల తమకు సంపూర్ణంగా తాగునీరు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి లీకులను నివారించి సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నానో పద్ధతిపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

నారు మడిలో నానో యూరియా, నానో డిఎపిలపై వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ రైతులకు అవగాహన కల్పించారు. కలవరాయిలో శుక్రవారం నాట్లు వేసే విధానంపై ఆయన రైతులకు వివరించారు. దీనివల్ల రసాయనాల ఖర్చు తగ్గించుకుంటూ ఆరోగ్యవంతమైన పంటను పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రమాదేవి, రవళి పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

రైతులకు మేలు చేయాలి

ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు మేలు జరిగేటట్లు చూడాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన, వెలుగు, తదితర రుణాలు అందించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. సూర్యఘర్ పథకం, అందించే రాయితీపై ఇపిడిసిఎల్ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వివి రమణమూర్తి, ఎంపిడిఒ ఇప్పలవలస సురేష్, నాలుగు మండలాల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

కూటమితోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని సంతపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నట్లు చెప్పారు. దీంతో ఎక్కడ చూసినా ప్రజలు నీరాజనాలు పడుతూ, ఆప్యాయతగా తనను ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ, సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

కూటమి వచ్చాకే ప్రజాస్వామ్యం బతికింది

మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికిందని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు తెలిపారు. శుక్రవారం స్థానిక నటరాజ్ థియేటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత జగన్ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కుంటుపడిందన్నారు. లిక్కర్ కుంభకోణంలో రాష్ట్రాన్ని జగన్ మోహన్ రెడ్డి ముంచేశారని, రూ.35 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రతినెలా జగన్మోహన్ రెడ్డికి రూ.60 కోట్లు.. జె ట్యాక్స్ రూపంలో వెళ్లిందన్నారు. మద్యం కుంభకోణంపై వాస్తవాలు బయటకు వస్తున్నా జగన్మోహన్ రెడ్డి కనీసం స్పందించడం లేదు కదా మౌనంగా ఉండటం విశేషమని ఎద్దేవాచేశారు. ఒక ఆరోపణ వచ్చినప్పుడు మౌనంగా ఉండడం అంటే నేరాన్ని అంగీకరించడమేనని వ్యాఖ్యానించారు. జగన్మోహన్ రెడ్డి తెచ్చిన కల్తీ మద్యం ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల మంది చనిపోయారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి లిక్కర్ స్కామ్‌లో నొక్కిన సొమ్మును ఆర్ఆర్ యాక్ట్ ద్వారా రికవరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

15న ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆగస్టు 15న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెత్సా సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30ఏళ్లగా ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 2024-25 సంవత్సరంలో 10 వ తరగతి ఇంటర్, డిగ్రీ పరీక్షలలో 85శాతం శాతం మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులు సంఘం వద్ద లభించే దరఖాస్తుతో పాటు, మార్కులు జాబితా, ఆధార్ కార్డు నఖలు అందజేయాలని కోరారు. ప్రాజెక్ట్ చైర్మన్ బొడ్డు కష్ణారావు మాట్లాడుతూ ఆగష్టు 15న ఉల్లి వీధి వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో నిర్వహించబోయే సభలో విద్యార్థులకు వెండి మెడల్, సర్టిఫికెట్ అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏడుకొండలు, సంఘం కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్త, కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పిడిఎస్ బియ్యం వేలం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

తనిఖీల్లో పట్టుబడిన పిడిఎస్ బియ్యాన్ని శనివారం వేలం వేయనున్నారు. జిల్లాలో గత కొద్ది కాలంగా చేపట్టిన తనిఖీల్లో దొరికిన పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలను, 6ఎ కేసులు నమోదు చేసి సంబంధిత ఎంఎల్ఎస్ పాయింట్లలో భద్రపరిచి ఉంచారు. బియ్యం నిలువల మొత్తం 131.68 క్వింటాళ్లకు చేరింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ బియ్యం నిల్వలను శనివారం విజయనగరం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద స్థానిక తహశీల్దార్ ఆధ్వర్యంలో పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్ల సమక్షంలో బహిరంగ వేలం వేయనున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు

ప్రజాశక్తి-రేగిడి

ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు తప్పవని ఎస్ఐ పి.నీలావతి అన్నారు. శుక్రవారం ఉంగరాడమెట్ట నుంచి పోలీస్ స్టేషన్ వరకు రోడ్ సేఫ్టీ లో భాగంగా ర్యాలీ నిర్వహించి, ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అతిక్రమించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు.

నేరాలు ఘోరాలు

బాగెంపేటలో చోరీ

ప్రజాశక్తి-వంగర

మండలంలోని బాగెంపేటలో పసుమర్తి శంకరరావు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. శంకరరావు మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లారు. ఆయన ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడంతో స్థానికులు సమాచారం ఇచ్చారు. వంగర పోలీసులు, క్లూస్ టీం ఆ ఇంటిని పరిశీలించారు. బాధితుడు శంకరరావు హైదరాబాద్ నుంచి వచ్చాక చోరీకి గురైన వాటిపై ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడికి గాయాలు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని ఉంగరాడ మెట్ట సమీపం పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం వేకువ జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడికి గాయాలయ్యాయి. తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి.. దీంతో యాచకుడు అస్వస్థత గురయ్యాడు. పోలీస్ సిబ్బంది రాజాం వైపు వెళుతుండగా అస్వస్థత గురైన యాచకుడుని చూసి 108 కు సమాచారం అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





ప్రజాశక్తి

గోవా రాష్ట్ర గవర్నర్

పూసపాటి అశోక్ గజపతిరాజు

ప్రమాణస్వీకారోత్సవ ప్రత్యేక అనుబంధం

Advt. Feature

శనివారం 26-7-2025 | విజయనగరం జిల్లా | 4 పేజీలు




ఎమ్మెల్యే నుంచి గవర్నర్ వరకు

- గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు నేడు ప్రమాణ స్వీకారం
- టిడిపి పూర్వ సీనియర్ నేతకు తగిన గుర్తింపు


టిడిపి పూర్వ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు. శనివారం ఉదయం 11గంటలకు గోవా గవర్నర్ బంగ్లాలో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లానుంచి పలువురు టిడిపి నాయకులు, అశోక్ కుటుంబ సభ్యులు ఇప్పటికే గోవా తరలివెళ్లారు. గోవా ఎయిర్‌పోర్టులో ఆయనకు అక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

విజయనగరం మహరాజు పివిజి రాజు కుమారుడైన అశోక్‌జగజపతిరాజు 1951 జూన్ 26న జన్మించారు. గ్వాలియర్‌లోని సింధియా, హైదరాబాద్‌పబ్లిక్ స్కూలులో, విశాఖలోని ప్రభుత్వ కృష్ణా కళాశాలలో చదువుకున్నారు. తన తండ్రి పివిజి రాజు వారసత్వంతో 1978లో మొట్టమొదటిసారిగా జనతా పార్టీలో చేరి విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. తరువాత 1982లో ఎన్‌టిఆర్ హయాంలో (మిగతా.. 2లో)









ఆధునిక రాజకీయాల్లో ఆడంబరాలకు దూరంగా ఉండడం, హంగూ ఆర్భాటాలు లేకుండా సాధారణంగా ఉండడంలో ఆయనకు ఆయనే సాటి. నిరాడంబరంగా జీవితం గడిపే నాయకుల్లో అశోక్‌గజపతిరాజు ఒకరు. విజయనగరం సంస్థానాదిశ కుటుంబ వారసులుగా, నిరాడంబర రాజకీయ నేతగా రాజకీయాల్లో ఆయనకు గుర్తింపు ఉంది. సాక్ష్యాత్తు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మన ప్రాంత పార్లమెంటు సభ్యుల ద్వారా అశోక్‌గజపతిరాజు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారంటే జాతీయ స్థాయిలో అశోక్‌కు గల గుర్తింపును తెలియజేస్తుంది. సంస్థానాధీసుల కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు భారత రాజ్యాంగం పట్ల గౌరవం, ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం కొట్టి పారేయలేనిది. చట్టాలను గౌరవించడం, న్యాయ ధర్మాలను ఆచరించడం ప్రతి ఒక్కరూ తమ విధిగా భావించాలంటారు ఆయన. ప్రజా స్వామ్యంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారుగా ఉండాలంటారు అశోక్‌గజపతిరాజు.



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సాధారణ ప్రయాణికుడిలా రైలు కోసం ఎదురుచూస్తున్న అశోక్ గజపతిరాజు

ఆయనకు ఆయనే సాటి

ప్రజాశక్తి - విజయనగరంకోట

అశోక్‌గజపతిరాజు తండ్రి డాక్టర్ పివిజి రాజు ఆనాటి ఆంధ్ర ప్రాంతంలో అత్యంత ప్రజాదరణ పొందిన రాజవంశీకులు. సోషలిస్ట్ భావాలు కలిగిన ఆయన నాటి దేశ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానం మేరకు జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. పివిజి రాజు సోషలిస్టు ఆలోచనలు పునికి పుచ్చుకున్న ప్రజాస్వామ్యవాది. పివిజి రాజు రాష్ట్రమంత్రిగా, ఎంపిగా పనిచేశారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కోరుకొండ సైనిక పాఠశాల ఏర్పాటుకు ఎంతో విలువైన వందలాది ఎకరాల భూమిని ప్రభుత్వానికి దానం చేశారు. పలు దేవాయాలు నిర్మించారు. విద్యాభివృద్ధికి గానూ మహారాజా సంగీత కళాశాల, సంస్కృత కాలేజీ ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రస్తుతం ఎవివిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, న్యాయ కళాశాల, పాలిటిక్నిక్ కళాశాల వంటి అనేక విద్యా సంస్థలు ఏర్పాటు చేసి ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దారు. ఈ విద్యా సంస్థలో విద్యన్యసభించిన వారు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. విజయనగరం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాణి అప్పలకొండమాంబ పేరిట తాగునీటి సౌకర్యం కల్పించారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని మహారాజా ఆసుపత్రి ప్రత్యేకించి మహిళల ప్రసవాల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక ఘోషాసుపత్రిని నిర్మించి మహిళలకు అందుబాటులో ఉంచారు. అంతటి దానగుణం గల కుటుంబం నుంచి వచ్చిన ఆనంద గజపతిరాజు, అశోక్‌గజపతిరాజు. ఆనంద గజపతిరాజు ఎంపిగానూ, రాష్ట్ర విద్యాశాఖామంత్రిగా పనిచేశారు. ఆయన తండ్రి స్థాపించిన మాన్సాస్ సంస్థకు అధ్యక్షులుగా ఉంటూ తన తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేశారు. ప్రస్తుతం అశోక్‌గజపతిరాజు మాన్సాస్ చైర్మన్‌గా పలు దేవాలయాలకు అనుశంశిక ధర్మకర్తగా సేవలందిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో విభజన చట్టం మేకు కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు ఒక విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుమతి మేరకు అశోక్‌గజపతిరాజు ఆ విమానాశ్రయాన్ని మన జిల్లాలోని భోగాపురంలో ఏర్పాటుకు పూనుకున్నారు. ఎన్టీయార్ నుంచి నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రివర్గాల్లో సుదీర్ఘ కాలం అనేక శాఖలు నిర్వహించిన అశోక్‌గజపతిరాజు జిల్లా అభివృద్ధికి కృషి చేశారు. వారి హయాంలోనే జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనం, జిల్లా సర్వజన ఆసుపత్రి భవన నిర్మాణాలతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు విద్యా సంస్థలు ఏర్పాటు, వాటి భవన నిర్మాణాలు జరిగాయి. అంతకుముందు అశోక్‌గజపతిరాజు భార్య సునీలా గజపతిరాజు విజయనగరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పట్టణ అభివృద్ధికి కృషి చేశారు. నిత్యం పలు వాహనాలతో రద్దీగా గల పట్టణంలోని ఎత్తుబ్రిడ్జి వద్ద ఏర్పాటైన సంతకాల బ్రిడ్జిలో అశోక్‌ది ఒక సంతకంగా చెప్పుకోవచ్చు. ప్రతి ఎన్నికల్లోనూ విజయనగరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన అశోక్ 2024లో ఆయన కుమార్తె అదితి విజయలక్ష్మి గజపతిరాజును పోటీలో నిలిపి విజయానికి కృషి చేశారు. జిల్లాలో టిడిపికి దశాదిశా నిర్దేశించే అశోక్‌గజపతిరాజు పట్ల పార్టీశ్రేణుల్లోనూ, నేతల్లోనూ గౌరవం తరగతనిది. అటువంటి ప్రజా నాయకుడు నేడు గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రధాని మోడీతో కరచాలనం చేస్తున్న అశోక్ గజపతిరాజు, చిత్రంలో సిఎం చంద్రబాబు (ఫైల్)

మంచికి మరో రూపం



మంచికి, మానవత్వానికి మరో రూపం అశోక్‌గజపతిరాజు. ఆయనకు గవర్నర్ పదవి రావడం అంటే జిల్లా వాసుల అందరి ఇంట్లో పదవి వచ్చినంత ఆనందంగా ప్రజలు ఉన్నారు. జిల్లాలో ఆయన చేసిన అభివృద్ధి ఎనలేనిది. తాగునీటి సౌకర్యం, రోడ్ల విస్తరణ, గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి పరచడం ఆయనకే సాధ్యం. ఆయన ఎందరో నాయకులకు ఆదర్శనీయులు. ఆయన బాటలోనే నడుస్తాం.

- వేచలపు శ్రీనివాసరావు, రాకోడు ఎంపిటిసి సభ్యులు,
విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

అరుదైన రాజకీయ నాయకుడు



రాష్ట్రంలోనే అరుదైన నాయకుడు అశోక్‌గజపతిరాజు. ఆయన విలువలతో కూడిన రాజకీయాలు నెరిపారు. కుట్రలు, కుతంత్రాలు ఆయనకు తెలియవు. పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఎంతోమందికి ఆయన ఆదర్శనీయులుగా నిలిచారు. నిస్వార్థ రాజకీయవేత్త ఆయన మాన్సాస్ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నాం.

- కొసర శివ,
టిడిపి నాయకులు, మలిచర్ల

నీతి, నిబద్ధతకు దక్కిన ఫలితం



కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు నీతి నిజాయితీ నిబద్ధతకు దక్కిన గౌరవం గోవా గవర్నర్ పదవి. దేశం, తెలుగు జాతి పట్ల ఆయనకు ఎనలేని అభిమానం. సేవా గుణం గల పూసపాటి కుటుంబం నుంచి వచ్చిన ఆయన మాన్సాస్ ట్రస్టు ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయన బాటలోనే ఆయన కుమార్తె ఎమ్మెల్యే అదితి విజయలలక్ష్మి కూడా నడుస్తున్నారు. ఆయనకు గవర్నర్ పదవి రావడం అభినందనీయం.

- తుమ్మగంటి రామారావు,
టిడిపి నాయకులు, మలిచర్ల

అశోక్ అంటేనే ప్రత్యేక గుర్తింపు



అశోక్ గజపతి రాజు అంటేనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న వ్యక్తి. ఆనాడు పార్లమెంట్‌లో బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డు వరించింది అంటే అతను నిబద్ధత విలువలకు నిదర్శనం. తన రాజకీయ జీవితంలో చేసిన ఎన్నో సేవలకు, అభివృద్ధికి గుర్తింపుగా గవర్నర్ పదవి వచ్చింది. ఆయన ఏనాడూ పదవులను ఆశించలేదు. పదవులే ఆయనను వరించాయి.

- కనకల రాంబాబు,
టిడిపి నాయకులు, పినవేమలి

ఎమ్మెల్యే నుంచి గవర్నర్ వరకు..



గవర్నర్‌గా ప్రమాణ స్వీకారానికి కుటుంబసభ్యులతో కలిసి గోవా వెళ్తున్న అశోక్

(మొదటి పేజీ తరువాయి)

టిడిపిలో చేరారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు 1983, 1985, 1989, 1994, 1999, 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో ఎక్సైజ్, వాణిజ్య, ఆర్థిక, రెవెన్యూ, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రిగా పనిచేశారు. 2014లో విజయనగరం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో కేంద్ర ప్రభుత్వంలో పౌర విమానయాన శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం మంజూరు విషయంలో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనగుతున్నారు. సుదీర్ఘకాలంగా పార్టీపొలిట్ బ్యూరో సభ్యుడిగా, సిఎం చంద్రబాబుకు ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. అశోక్ సతీమణి సునీలా గజపతిరాజు విజయనగరం మున్సిపల్ చైర్మన్‌గా సేవలందించారు. అశోక్‌గజపతిరాజుకు అదితి విజయలక్ష్మి, విద్యా గజపతిరాజు కుమార్తెలు. 2024 ఎన్నికల్లో కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

బయోడేటా

పేరు	:పూసపాటి అశోక్‌జగపతిరాజు
పుట్టిన తేదీ	:26-06-1951
తండ్రి	:డాక్టర్ పివిజి రాజు
తల్లి	: కుసుమ గజపతి
భార్య	: సునీలా గజపతి
పిల్లలు	: అదితి గజపతి, విద్యావతిదేవి
విద్యాభ్యాసం	:గ్వాలియర్‌లో సింథియా స్కూల్, హైదరాబాద్‌లో పబ్లిక్ స్కూల్, విశాఖలో విఎస్ కృష్ణా కాలేజీ.
రాజకీయం	: 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం 1982లో టిడిపి ఆవిర్భావం నుంచి అందులోనే కొనసాగారు.

చేపట్టిన పదవులు : 1983, 1985, 1989, 1994, 1999, 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో విజయనగరం లోక్‌సభ స్థానం నుంచి ఎంపిగా విజయం సాధించారు. రాష్ట్ర వాణిజ్య పన్నులు, అబ్కారీ, శాసనసభ వ్యవహారాలు, రెవెన్యూ, ఆర్థికశాఖమంత్రిగానూ, కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు.

పదవులకే వన్నె తెచ్చిన నాయకుడు



విలువలు, నియమ నిబంధనలకు కట్టుబడి ఉన్న వ్యక్తి అశోక్‌గజపతిరాజు. పార్టీలో ఎదిగి, ఒదిగిన ఏకైక నేత. 1982 మార్చి 29న పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో చేరి ఎన్‌టిఆర్ విధేయుడిగా, అభిమానస్తుడిగా, నమ్మకస్తుడిగా ఒక కుడి భుజంగా ఉంటూ వచ్చారు. చంద్రబాబు నాయుడు, అశోక్ గజపతిరాజు ఇరువురి రాజకీయ స్నేహం నేటికీ పదిలంగా ఉందంటే ఒకే మాట ఒకే బాటపై ఉండడమే. ఆ ఒరవడే నేడు అశోక్ గజపతి రాజును ఈ స్థాయికి తీసుకొచ్చింది. పార్టీ పదవులను ఎప్పుడూ ఆయన పట్టుకు వేలాడలేదు, పదవులే ఆయనను వరిస్తూ వస్తున్నాయి. ఈనాడు రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవి ఆయనకు వచ్చిందంటే కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అశోక్ గజపతిరాజుపైన ఉన్న విశ్వాసమే కారణం.

- ఐవిపి రాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి

అశోకుని హయాంలో ద్వారపూడి అభివృద్ధి

ప్రజాశక్తి - విజయనగరంకోట

ద్వారపూడి గ్రామ అభివృద్ధిలో అశోక్‌గజపతి రాజు ముద్ర ఉంది. కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ద్వారపూడి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అక్షరాస్యతను పెంపొందించే కార్యక్రమంలో భాగంగా చిట్టిగురువులు కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఇది విజయ వంతమై దేశంలోనే గుర్తింపునకు తీసుకొచ్చి ద్వారపూడి గ్రామ ప్రతిష్టను పెంచింది. గ్రామంలో మరుగుదొడ్లు లేక రోడ్లపైనే మలవిసర్జన చేసేవారు. ఆయన కృషితో గ్రామంలో వివిధ ప్రదేశాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు.. గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు కాలువల్లో గొట్టాలు ఉంటే ఇంజినీరింగ్ అధికారులను పిలిపించి కాలువల్లో కాకుండా తాగునీరు గొట్టాలను పునర్మించారు. డిజిటల్ చెల్లింపులు కూడా ఈ గ్రామం నుంచి అలవాటు చేశారు. గ్రామంలో సోలార్ ప్యానల్‌ను నిర్మించి వీధిలైట్లకు సోలార్ కాంతులతో వెలుగునిచ్చారు. విజయనగరం నగర పాలక సంస్థలకు రూ.5కోట్లు వ్యయంతో సోలార్ ప్లాంట్లను నిర్మించి విద్యుత్ భారాన్ని తగ్గించారు. అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పాఠశాలల్లో ఆటవస్తువులతో పాటు మౌలిక వసతులు కల్పించారు. గ్రామంలో సిసి రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టారు.

మా నాన్నే నా రాజకీయ గురువు

- గవర్నర్ పదవి రావడం ఎంతో సంతోషంగా ఉంది
- 50 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషి
- ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు



ప్రజాశక్తి-విజయనగరంకోట

మా నాన్నే నా రాజకీయ గురువు అని విజయనగరం నియోజకవర్గ శాసనసభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. కేంద్ర మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజుకు గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో ఆయన కుమార్తె అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ తన తండ్రి 50ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషి అని అన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు గవర్నర్ పదవిని కట్టబెట్టారని, వారి అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకు తండ్రి అశోక్‌గజపతిరాజు అందించిన సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నానని, ఇక పైన రాజకీయపరమైన సలహాలు ఉండవని బాధ అయితే తనలో ఉందని అన్నారు. తండ్రిగా తమను ఒక ఆడపిల్ల లాగానే పెంచి పెద్ద చేసి ఉన్నతమైన విలువలు నేర్పి ఈరోజు ఈ స్థితికి తీసుకువచ్చారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లోనే నడుస్తూ , ఆయన విలువలు, నిబంధనలు, క్రమశిక్షణ అలవర్చుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానని తెలిపారు. తండ్రి అశోక్ రాజకీయ జీవితంలో సమాజం పట్ల, అభివృద్ధి పట్ల ఏ విధంగా అయితే ముందుకు వెళ్లారో అదేవిధంగా తాను కూడా వెళ్తానని చెప్పారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రం, దేశం గర్వపడే విధంగా ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగు తుందన్నారు. జీవితంలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

పదవులకే వన్నెతెచ్చిన నాయకుడు అశోక్

టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున



పదవులకే వన్నె తెచ్చిన నాయకుడు అశోక్‌గజపతిరాజు అని టిడిపి జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతిరాజు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లో..

సాధారణంగా రాజకీయాల్లో ఉన్నవారు పదవులను కోరు కుంటారు. అది మానవ సహజం. అయితే ఆ పదవుల ద్వారా కొందరు మంచి చేయాలనుకుంటారు. మరికొందరు స్వప్రయోజ నాలకు వాడుకుంటారు. కానీ మంచికి వాడే మహా మనిషి అశోక్ గజపతిరాజు. పదవులే ఆయన్ని కోరుకుంటాయి. ఎందుకంటే ఆ పదవులకు వన్నె తెచ్చే విధంగా హుందాగా వ్యవహరిస్తూ ఆ వ్యవస్థలను సరియైన గాడిలో పెట్టి పయనింప చేయడం ఆయన సహజ గుణం. అందుకే ఆయన ముందు గవర్నర్ పదవి చిన్నదే అనిపిస్తుంది. ఆయన 1978లో మొట్టమొదట ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఆయన జిల్లాను అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిగా ఆ రంగంలో విశేషమైన మార్పులు తీసుకొచ్చి, ప్రయాణాన్ని సులభతరం చేశారు. భోగాపురంలో ఆయన తీసుకొచ్చిన అంతర్జాతీయ విమానాశ్రయంతో విజయనగరం ఖ్యాతి దేశవ్యాప్తంగా వినిపించ బోతుందంటే ఆయన కృషి ఫలితమే. నేడు గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న అశోక్ గజపతిరాజుకు ప్రత్యేక అభినందనలు.

నిత్య కృషీ వలుడు అశోక్‌గజపతిరాజు



సమాజ సేవలో నిత్య కృషీవలుడు మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు. తన రాజకీయ జీవితంలో సమాజ అభ్యున్నతికి రాజకీయ పురోగతికి నిరంతరం కృషి చేశారు. తన శక్తి మేరకు భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ఖచ్చితమైన పరిపాలన ప్లానింగ్ చేసుకుని ముందుకు వెళ్లే నాయకుల్లో ఆయన ప్రథముడు. అశోక్ గజపతిరాజు అంటేనే ఒక మార్గదర్శి. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు బడి ఈడి పిల్లల కోసం తీసుకువచ్చిన చిట్టి గురువులు కార్యక్రమం దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. చిన్నారుల చదువుకు ఎంత ఉపయోగపడింది అంటే అది అతిశయోక్తి కాదు. ఈ కార్యక్రమాన్ని దేశ ప్రధానమంత్రి రాష్ట్రపతి సైతం జై కొట్టారంటే ఆయన భవిష్యత్ తరాల కోసం ఎంత ఆలోచిస్తారో అర్థం చేసుకోవచ్చు. ఆ ఆలోచనతోనే విజయనగరంలో నీటి కొరత లేకుండా చేసిన మహనీయుడు. సౌర విద్యుత్ ఫలకలను ఏర్పాటు చేసి మున్సిపాలిటీకి విద్యుత్ తీసుకు వచ్చిన ఘనుడు. ఇటువంటి ఆలోచనలతో ఆయన ఎప్పుడూ భవిష్యత్ తరాల కోసం ముందు వరుసలో ఉంటారు. ఆయన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో సేవలు అభినందనీయం.

- ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు, విజయనగరం

ఆయన అజాత శత్రువు



అశోక్‌గజపతిరాజు నీతి, నిజాయితీ, హుందాతనానికి పార్టీ ఇచ్చిన గౌరవం గవర్నర్ పదవి. అశోక్ గజపతిరాజు అంటే ఒక అజాతశత్రువు. పార్టీ ఆయనకు అందించిన గౌరవం. తన 47 ఏళ్ల రాజకీయ జీవితం ఎందరికో ఆదర్శం అన్నారు. 1978లో మొదలైన తన రాజకీయ జీవితం 2004, 2019లో వాటిని తప్ప మరెక్కడా ఓటమి లేదు. ఎన్‌టిఆర్, చంద్రబాబునాయుడు ప్రభుత్వాల్లో ఎన్నో మంత్రి పదవులు చేపట్టారు. కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు గవర్నర్ పదవి రావడం జిల్లాతో పాటు యావత్ రాష్ట్రం గర్విస్తుంది. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు, గోవాలో మోపా ఎయిర్ పోర్ట్ శంకుస్థాపన చేశారు. ఆయన సూచనలు, సలహాలు సర్వదా ఆచరణీయం.

- పి.రాజేష్‌బాబు, ఎంపిటిసి సభ్యులు, జొన్నవలస

కోహినూర్ వజ్రం లాంటి వ్యక్తి



మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ఈ ప్రపంచంలో కోహినూర్ వజ్రం లాంటి వారు. ప్రపంచంలో ఉన్నత విలువలు కలిగిన వ్యక్తుల్లో ఆయన ఒకరు. ఎంతోమందికి రాజకీయ మార్గదర్శకుడు. ఆయన బాటలోనే మేమంతా నడుస్తున్నాం. అటువంటి ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి మాకు మార్గదర్శకులుగా ఉండడం ఎన్నటికీ మర్చిపోలేని విషయం. క్రమశిక్షణకు మారుపేరు అశోక్ గజపతిరాజు. తన రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు చేపట్టి ఉన్నత శిఖరాలకు ఎదిగారు.తాజాగా గవర్నర్‌గా నియమితులు కావడం అభినందనీయం.

- బొద్దల నర్సింగరావు, టిడిపి మండల అధ్యక్షులు


సరిలేరు మీకెవ్వరూ..



విలువలు, సమయపాలన అమలులో కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజుకు రాష్ట్రంలోను, జిల్లాలోనూ ఎవరూ సరిలేరు. సమాజ సేవలోను, రాజకీయ సేవలోను ఆయనకు మించిన నాయకుడు మరెవరూ ఉండరు. ఆయన తల్లిదండ్రులు, తాతలు చేసిన విద్యాదానాలు మరువలేనివి. మహారాజా విద్యాసంస్థలలో చదువుకొని నేడు కొన్ని లక్షల మంది విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడి ఉన్నారంటే ఆ విద్యాసంస్థల గొప్పదనం ఏ పాటిదో అర్థమవుతుంది. ఒక అంధ విద్యార్థి కోసం సంగీత కళాశాలనే ఏర్పాటు చేసిన మహనీయులు. అశోక్ గజపతిరాజు కోసం ఎంత చెప్పుకున్న తక్కువే.

- బొబ్బాది ఈశ్వరరావు , సారిక గ్రామసర్పంచ్

నిస్వార్థపరులు అశోక్‌గజపతిరాజు



ప్రజల కోసం, జిల్లా అభివృద్ధి కోసం తన 47 ఏళ్ళ రాజకీయ జీవితంలో నిస్వార్థంగా సేవ చేసిన నాయకులు అశోక్‌గజపతిరాజు. 1978 సంవత్సరంలో జనతా పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు. తరువాత అన్న నందమూరి తారక రామారావు పెట్టిన తెలుగుదేశం పార్టీలో చేరి నాటి నుంచి నేటి వరకు రాష్ట్రానికి, దేశానికి తన సేవలందించారు. ఆయన ఏనాడూ పదవులు కోరుకోలేదు. అలా అని వచ్చిన పదవులను తిరస్కరించకుండా ఆ పదవులకు వన్నె తెచ్చే విధంగా, ఒక కిరీటంగా ఉంటూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన నేడు గోవా గవర్నర్‌గా నియమితుల కావడం పట్ల జిల్లా వాసులు, రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

- కంది సాయి జగ్గారావు, మాజీ ఎంపిపి, విజయనగరం


పార్టీ సేవకు అరుదైన గుర్తింపు



సమాజం, పార్టీ సేవకు అరుదైన గుర్తింపు అశోక్‌గజపతిరాజుకు గవర్నర్ పదవి. ఆయన కోసం ఎంత చెప్పినా తక్కువే. తన 47ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి రాష్ట్రంలోనైనా, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోనైనా విలువలు గల నాయకుడు. ఎప్పటికప్పుడు సంస్కరణలు చేసుకుంటూ ముందుకు సాగుతుంటారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు అవినీతి మరక లేకుండా మకుటం లేని మహారాజుగా వెలుగొందారు. అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి వన్నెతెస్తుంది. రాజ్యాంగ బద్ధమైన గవర్నర్ పదవికి ఆయన అన్ని విధాలా అర్హులు. ఆనాడు జిఎంసి బాలయోగిని గవర్నర్ గా నియమించడం, ఇప్పుడు అశోక్ గజపతిరాజును నియమించడం చంద్రబాబు నియమ నిబంధనలకు ఇంతకంటే గుర్తింపు ఏముంటుంది.

- గంటా పోలినాయుడు, టిడిపి మండల కార్యదర్శి ,విజయనగరం

విజ్ఞత కలిగిన నాయకుడు



మంచి విజ్ఞత కలిగిన నాయకుడు అశోక్‌గజపతిరాజు. నిర్ణయాలను కచ్చితంగా అమలు చేస్తారు. ఎటువంటి సందర్భాల్లోనైనా నాయకులకు, ప్రజలకు, సమాజానికి మంచి ఆలోచనలతో సరియైన దిశా నిర్దేశం చేస్తారు. తన నిర్ణయాలతో సమాజాన్ని అభివృద్ధిలో తీసుకురావడానికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి. తన సలహాలు, సూచనలతో జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని కూడా తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని పొందారు. ఎందరో నాయకులు ఆయన సలహాలు ఆచరించి ఎంతో ఎత్తుకు ఎదిగారు. నేడు ఆయన గోవా గవర్నర్‌గా నియమితులు కావడం ఎంతయినా గర్వకారణం. ఇన్నాళ్ళ సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన ఏనాడూ మాట పడని వ్యక్తి అశోక్ గజపతిరాజు.

- చొప్ప రామారావు, టిడిపి నాయకులు, కోరుకొండపాలెం

ముందుచూపు ఉన్న నేత అశోక్



కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సమాజాన్ని ముందుచూపుతో చూసి నడిపిన నాయకుడు. రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో ఏ పదవి ఆయనకు ఇచ్చినా నూరుశాతం న్యాయం చేస్తారు. ఏ పదవికైనా ఆయన అర్హుడు. జిల్లా, రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. మాలాంటి నాయకులెందరికో ఆయన ఆదర్శనీయులు.ఆయన అడుగుజాడల్లో నడుస్తాం.

- సుంకరి పైడిరాజు, టిడిపి నాయకులు, సుంకరిపేట

గురుతర బాధ్యత కలిగిన నాయకుడు



ఒక గురుతర బాధ్యత కలిగిన నాయకుడు కేంద్ర మాజీ మంత్రి, మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు. ఇటు జిల్లా రాజకీయాల్లోనే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో గురువు పాత్ర పోషిస్తూ సలహాలు సూచనలు ఇస్తూ పార్టీ ఎదుగుదలలో నిత్య మార్గదర్శకులు. జిల్లా లో పార్టీని ఒక తాటిపై నడిపించడం ఆయనకు మాత్రమే సొంతం. సహృదయం గలవారు. ఏ సమస్య అయినా ముందే పసిగట్ట గల రాజకీయ విజ్ఞతుడు. సమయపాలనలో తనకు తానే సాటి. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న నాయకుడు అశోక్ గజపతిరాజు. తాను అందించిన సలహాలు సూచనలు పాటిస్తూ నేడు రాజకీయాల్లో ఆయన చూపించిన మార్గంలోనే మేము ముందుకు వెళ్తున్నాం. ఇటువంటి మహనీయులను అరుదుగా చూస్తాం. నిరంతరం ప్రకృతిని ఆస్వాదించే ప్రకృతి ప్రేమికుడు. భవిష్యత్ తరాలకు మార్గదర్శి మన కషివలుడు అశోక్ గజపతిరాజు.

-పాశి అప్పలనాయుడు, టిడిపి సీనియర్ నాయకులు, బడుకొండపేట

మంచికి మారుపేరు



నీతి, నిజాయితీకి, మంచికి మారుపేరుగా నిలిచిన వ్యక్తి పూసపాటి అశోక్ గజపతిరాజు. టిడిపి ఆవిర్భావం నుంచి జిల్లాలో పార్టీని నేడు ఈ స్థాయికి అభివృద్ధి చేశారంటూ ఆయన కృషే. పార్టీని ఒకతాటిపై నడిపిస్తూ కంచుకోటగా మార్చారు. స్వార్థం ఎరుగని నాయకుడు. విలువలకు నిలువుటద్దంగా నిలిచారు. అవినీతి లేని పాలన చేసి చూపిన నాయకుడు. నాయన నుంచి ఎన్నో విషయాలు నేటి రాజకీయ నాయకులు నేర్చుకోవాలి. అందరికీ ఆదర్శప్రాయులు ఆయన.

- పడగల రామకృష్ణ, టిడిపి నాయకులు, బియ్యాలపేట

గ్రామ అభివృద్ధిలో ముఖ్య భూమిక వహించారు



మా ద్వారపూడి గ్రామ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించిన మహనీయుడు కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు. నియోజకవర్గంలో మా గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసి పవర్ ఆదా చేయడానికి ఎంతో కృషి చేశారు. దానిని గత ప్రభుత్వం ధ్వంసం చేయడం బాధాకరమైన విషయం. ఆయన నీతి నిజాయితీకి నిలువుటద్దం. క్రమ శిక్షణకు మారుపేరు. నిబద్ధత కలిగిన వ్యక్తి.

- వెన్ను శ్రీనివాసరావు, ఉప సర్పంచ్, ద్వారపూడి